సాక్షి
మంచిర్యాల
శనివారం ⋅ 9 ⋅ డిసెంబర్ ⋅ 2023

దివ్యాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర దివ్యాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య తెలిపారు. దివ్యాంగులు, దివ్యాంగుల కోసం పని చేసే సంస్థలు ఈ నెల 10లోగా https://wdsc.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 14న మంచిర్యాల జెడ్పీపీహెచ్ఎస్(బాలుర) మైదానంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



గూడెంలో భక్తుల సందడి

దండేపల్లి: గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. 393మంది జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0 /18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

అవిశ్వాస అస్త్రం!

- జిల్లాలోని పురపాలికల్లో లుకలుకలు
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై సభ్యుల అసమ్మతి
- మద్దతు కూడగడుతున్న చైర్‌పర్సన్ ఆశావహులు
- బుజ్జగిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం

2020లో మున్సిపల్ ఎన్నికల్లో ఫలితాలు(తర్వాత కొందరు పార్టీ మారారు)

మున్సిపాలిటీ	వార్డులు	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	సీపీఐ	స్వతంత్ర
మంచిర్యాల	36	21	14	-	-	01
బెల్లంపల్లి	34	25	02	01	-	06
నస్పూర్	25	10	06	03	02	03
క్యాతన్‌పల్లి	22	19	01	-	01	01
చెన్నూర్	18	16	-	-	-	02
లక్సెట్టిపేట	15	09	05	-	-	01
మొత్తం	150	100	28	04	03	15

నోట్: నస్పూర్‌లో ఒకరు ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి గెలిచారు.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని పురపాలకవర్గాల్లో కౌన్సిలర్ల అసంతృప్తి అవిశ్వాసం వైపు అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో సర్కారు మార్పు జిల్లా పురపాలికల్లోనూ పడింది. గత నాలుగేళ్లుగా అసమ్మతితో ఉన్న సభ్యులంతా తమ బలం చూపించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై 19మంది కౌన్సిలరు అవిశ్వాసం తీర్మానం నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాల పరిధిలోనూ ఇద్దరు కౌన్సిలర్లు చైర్మన్ పదవీపై గురి పెట్టి పావులు కదుపుతున్నారు. నస్పూర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల మధ్య సఖ్యత లేదు. వైస్ చైర్మన్‌గా ఉన్న తోట శ్రీనివాస్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయనతోపాటు మరికొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి పరిస్థితిపై స్పష్టత రావడం లేదు. జిల్లాలో మిగతా చోట్ల కూడా మున్సిపాలిటీల్లోని కౌన్సిలర్లు పార్టీ మారి, కాంగ్రెస్ కౌన్సిలర్లతో జత కట్టి అవిశ్వాసం వైపు అడుగులు వేస్తున్నారు.

చైర్మన్లపైనే అసంతృప్తి

జిల్లాలో మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి, బెల్లంపల్లి పట్టణాల్లో పాలకవర్గాలు ఉన్నాయి. మందమర్రి పట్టణానికి ఏజెన్సీ సమస్యతో ఎన్నికలు లేవు. ఆరు చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ నుంచే చైర్‌పర్సన్‌లు కాగా, ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉంది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయడంతో ఆ పార్టీలో కొత్త ఉత్సాహం నింపింది. తాజాగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించగానే ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ క్రమంలో తమ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు

గద్దెదింపడమే లక్ష్యమా?

ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం వచ్చే నెల 26నాటికి నాలుగేళ్లు అవుతుంది. మూడేళ్ల తర్వాతే సభ్యులు అవిశ్వాసం ప్రకటించే అవకాశం ఉంది. దీనిని నాలుగేళ్లకు పెంచుతూ బీఆర్‌ఎస్ సర్కారు జీవో ఇచ్చింది. ఈ జీవో గవర్నర్ నుంచి ఆమోదం పొందలేదు. తాజాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పాటుతో బీఆర్‌ఎస్ అసంతృప్తి కౌన్సిలర్లకు పార్టీ మారేందుకు ఊతం దొరికింది. కేవలం ఏడాది కాలానికే చైర్మన్, వైస్ చైర్మన్లపై ఉన్న అసంతృప్తితో గద్దె దింపాలని భావిస్తున్నారు. ఉదాహరణకు క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22మంది కౌన్సిలర్లు ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. సొంత పార్టీలోనే వ్యతిరేకతతో ఇద్దరు చైర్మన్ పదవీ కోసం ముందుకు వస్తున్నారు. సభ్యుల మద్దతు కూడగట్టి అవిశ్వాసం వైపు ఆలోచనలు చేస్తున్నారు. ఇందుకు రూ.లక్షల్లోనే ఖర్చు చేసుకోవాలి. ఆ మేరకు ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న వారే ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇలా జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో అంతర్గతంగా అవిశ్వాసంపై సభ్యుల అడుగులు పడుతున్నాయి. మంచిర్యాల పట్టణంలోనూ బీఆర్‌ఎస్‌లో ఓ కౌన్సిలర్ చైర్మన్ పదవీ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. తాము మద్దతు ఇవ్వాలంటే మళ్లీ కౌన్సిలర్ టికెట్ హామీ లేక, ఎంతో కొంత ముట్టజెప్తేనే మద్దతు ఇస్తామనే మెలిక పెడుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

వెనక్కి తగ్గుతారా? లేదా? అనేది చర్చ నడుస్తోంది.

మాజీ ఎమ్మెల్యేల మంత్రాంగం

బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాల్లోనూ పాలకవర్గాలను కోల్పోతే పార్టీ మరింత బలహీన పడే అవకాశం ఉంది. బెల్లంపల్లిలో పార్టీ పట్టు కోల్పోతోంది. దీంతో మాజీ ఎమ్మెల్యేలు పరిస్థితులను గమనిస్తున్నారు. తమ ప్రజాప్రతినిధులను అవిశ్వాసం వైపు వెళ్లొద్దని కోరుతున్నారు. మంచిర్యాల పరిధిలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కౌన్సిలర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇక చెన్నూరు, క్యాతనపల్లి మున్సిపాలిటీల పరిధిలో కౌన్సిలర్లు, నాయకులకు మాజీ ఎమ్మెల్యే సుమన్‌తో సమావేశం అయ్యేందుకు హైదరాబాద్‌కు రావాలని ఆదేశాలు వచ్చాయి.

న్యూస్‌రీల్

కవ్వాల్‌లో శిక్షణ సెక్షన్ అధికారులు


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

జన్నారం: దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 40 మంది శిక్షణ సెక్షన్ అధికారులు శుక్రవారం కవ్వాల్ టైగర్‌జోన్‌లో పర్యటించారు. ఉదయం జన్నారానికి చేరుకున్న వారు ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని కల్పకుంట, జన్నారం రేంజ్ గొండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో పరిశీలించారు. వారికి వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ద్వారా పక్షుల రకాలు, వాటి శాస్త్రీయ నామాలను తెలియజేశారు. డిప్యూటీ రేంజ్ అధికారులు తిరుపతి, ప్రకాశ్ అడవుల్లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలు, నీటికుంటలు, వన్యప్రాణుల సంరక్షణ తదితర వాటిపై వివరించారు. అడవుల రక్షణ, స్మగ్లింగ్ నిరోధం, ఎంస్ట్రైబ్ నిర్వహణ, సీసీ కెమరాల నిర్వహణపై తెలియజేశారు. అనంతరం వారు తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. వారి వెంట అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం


గ్రహణ మొర్రి శిబిరంలో వైద్యుల పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్(నిర్ధారణ) క్యాంపును డీఈవో యాదయ్య శుక్రవారం ప్రారంభించారు. బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరానికి 24 మంది హాజరయ్యారు. ఆరు నెలల వయస్సు నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన వారు శిబిరానికి హాజరు కాగా 11 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరందరికీ జనవరిలో బసవతారకం ఆసుపత్రిలో ఉచిత శస్త్ర చికిత్స చేయనున్నట్లు ఆసుపత్రి వైద్యుడు ముకుందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, సైన్స్ అధికారి మధుబాబు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవోస్ సభ్యులు కోరారు. నూతన సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేయగా, వారికి శుభాకాంక్షలను తెలుపుతూ శుక్రవారం టీఎన్జీవోస్ భవన్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగులో ఉన్న 3 డీఏలను విడుదల చేసి, పీఆర్సీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు కేజియా రాణి, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్, చెన్నూర్ యూనిట్ అధ్యక్షుడు అభిషేక్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్, కార్యవర్గ సభ్యులు తిరుపతి పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా మేఘన


మేఘన

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన గడ్డం మేఘన శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. ఓరియంట్ సిమెంట్ కంపెనీలో క్లర్క్‌గా పనిచేస్తున్న గడ్డం పురుషోత్తం, మాలతిలత దంపతుల కూతురు మేఘన ఓయూ టాపర్‌గా నిలవడంతోపాటు ఇప్పటికే పలు బంగారు పతకాలు అందుకుంది. 1నుంచి 10వ తరగతి వరకు దేవాపూర్ కార్మెల్‌గిరి పాఠశాలలో చదివి, 'పది'లో 9.8జీపీఏ, ఇంటర్ శ్రీచైతన్యలో 96శాతం మార్కులు సాధించింది. డిగ్రీ కరీంనగర్‌లో, ఎల్‌ఎల్‌బీ ఉస్మానియా యూని వర్సిటీలో చేసి రెండు బంగారు పతకాలు అందుకుంది. పీజీ లాసెట్‌లో 3వ ర్యాంకు, ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జి ఎంపికలో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించింది. ఈ నెల 1న హైకోర్టులో నిర్వహించిన ఇంటర్వ్యూ ఫలితాలు శుక్రవారం విడుదల చేశారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

బెల్లంపల్లి: సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ డెప్యూటీ సెక్రెటరీ వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈలో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 17గురుకులాల విద్యార్థుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఆదిలాబాద్ రీజియన్ రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని ప్రశంసించారు. వంద శాతం ఉత్తీర్ణతను ఈసారి కూడా సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల సమన్వయ అధికారులు బాల భాస్కర్, బాలరాజు, శ్రీనివాస్, 17గురుకులాల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ప్రసూతి సేవలు ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఎట్టకేలకు ప్రసూతి సేవలు ప్రారంభమయ్యాయి. కరోనా వైరస్ విజృంభించిన సమయంలో ప్రసవాలు, కార్మికులకు వైద్య సేవలు మూడేళ్లపాటు నిలిచిపోయాయి. కరోనా తగ్గుముఖం పట్టిన వెంటనే ప్రసూతి సేవలు పునరుద్ధరించాలని కార్మిక సంఘాలు, కార్మికులు కోరుతూ వస్తున్నారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిలో జనరల్ మజ్దూర్ కార్మికుడు కె.అశోక్‌కుమార్ భార్య మంజులకు రెండో కాన్పు చేశారు. గైనకాలజిస్ట్ అరుణ జ్యోతి, మత్తు డాక్టర్ ప్రశాంత్ ఆపరేషన్ చేశారు. ఇది ఆమెకు రెండో కాన్పు కాగా మగబిడ్డ జన్మించాడు. ఆసుపత్రిలో ప్రసవ సేవలు ప్రారంభించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'రియల్' బ్రేక్..!


కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు

- జిల్లాలో తగ్గిన రిజిస్ట్రేషన్లు
- ఎన్నికల నేపథ్యంలో పడిపోయిన ఆదాయం
- వచ్చే నెల నుంచి వరుస ఎన్నికలు
- రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం కష్టమే..

మంచిర్యాలటౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థిరాస్తి వ్యాపారం ఒక్కసారిగా స్తబ్దుగా మారిపోయింది. ఎన్నికలు ముగిసినా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగని పరిస్థితి నెలకొంది. వచ్చే నెలలో సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పార్లమెంటు ఎన్నికలు వరుసగా ఉండనుండడంతో వాటి ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడే అవకాశం ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండడంతో క్రయవిక్రయాలు తగ్గి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గనుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారిన నాటి నుంచి ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. మంచిర్యాలలో ప్రతీ రోజు వంద వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, నెలలో 3 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగి, రూ.5 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుండగా, ఇటీవల ఆదాయం సగానికి పైగా తగ్గిపోయింది.

ఎన్నికల కోడ్‌తో గత రెండు నెలలుగా రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. రూ.50 వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లవద్దనే నిబంధనతో రిజిస్ట్రేషన్లపై ప్రభావం చూపించింది. ప్రభుత్వానికి కట్టే స్టాంపు డ్యూటీ చలానాకు లక్షలాది రూపాయలు అవసరం కావడం, ప్రభుత్వానికి చూపించే మార్కెట్ విలువ కంటే, కొనుగోలు చేసే విలువ ఎక్కువ. దీంతో బ్యాంకుల ద్వారా అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలను నిర్వహించకుండా, నగదు రూపంలోనే ఎక్కువగా కొనుగోళ్లు జరుగుతుంటాయి. దీంతోనే ఎన్నికల కోడ్ రావడంతో రిజిస్ట్రేషన్లపై దాని ప్రభావం ఎక్కువగా పడింది. ఈ నెల 5నుంచి ఎన్నికల కోడ్‌ను పూర్తిగా ఎత్తివేయడంతో ఇప్పుడిప్పుడే రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతోంది. జనవరిలో సర్పంచ్ ఎన్నికలు జరిగితే మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు రియల్ వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. వచ్చే నెల వరకు రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉన్నట్లు మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ మురళి తెలిపారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఆదాయం

నెల	రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో)
ఏప్రిల్	3,1010	5.46
మే	3,571	6.27
జూన్	1,805	4.73
జూలై	1,633	3.99
ఆగస్టు	1,667	5.54
సెప్టెంబర్	1,016	3.46
అక్టోబర్	1,272	3.98
నవంబర్	1,066	3.95
డిసెంబర్	225	1.10 (ఈ నెల 7వరకు)

జోరు పెరిగే సమయంలోనే..

రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగేది వర్షాకాలం ముగిసిన తరువాతే. వర్షాలు లేని సమయాల్లోనే కొత్తగా ఏర్పాటయ్యే వెంచర్లు, గతంలోనే కొనుగోలు చేసిన భూముల క్రయవిక్రయాలు పెరుగుతుండడం, పెళ్లిళ్లు, ఉన్నత చదువుల కోసం ఇళ్లు, భూముల అమ్మకాలు చేస్తుంటారు. అక్టోబర్ నుంచి మే వరకు స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుంది. వ్యాపారం పుంజుకునే సమయంలోనే ఎన్నికలు రావడంతో అమ్మకాలు, కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. రియల్ వ్యాపారం జరిగే సమయంలోనే ఇలా క్రయవిక్రయాలపై ఎన్నికల కోడ్ ప్రభావం పడడంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో 3 వేలకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా రూ.5 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఆ తరువాత రిజిస్ట్రేషన్లు కాస్త నెమ్మదించగా, రియల్ వ్యాపారంపై దాని ప్రభావం ప డింది. ఎన్నికల్లో డబ్బులు అవసరమైన అభ్యర్థులకు క్రయవిక్రయాలు తగ్గడం ఇబ్బందిగా మారింది. మరో నెలరోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలకు డబ్బులు అవసరమైన వారు క్రయవిక్రయాలు జరిపితే, జిల్లాలో మరోసారి రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉంది.

మహిళలకు బస్సుల్లో ఫ్రీ


శుక్రవారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు రద్దీ

- నేటి నుంచి ఆర్టీసీలో అమలు
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లోనే అవకాశం
- రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం

మంచిర్యాలఅర్బన్: కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, ఆడపిల్లలు, ట్రాన్స్‌జెండర్ల ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చింది. మంచిర్యాల డిపో పరిధిలో శనివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి అధికారులు లాంఛనంగా ప్రారంభించిన తర్వాతే ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటి వారం రోజులు ఎలాంటి ఐడీ కార్డు లేకపోయినా ప్రయాణానికి వెసులుబాటు కల్పించారు. ప్రతీ స్టేజీలో బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచనలు చేశారు. స్టార్‌లో ప్రతీ ట్రిప్పులో ఎంతమంది మహిళలు బస్సులో ప్రయాణం చేశారో వివరాలు నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

టికెట్ లేకుండానే..

ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారో లెక్క తేల్చేందుకు కర్ణాటక తరహాలో జీరో టికెట్ విధానం ఉంటుందని ప్రచారం జోరుగా సాగింది. తెలంగాణలో జీరో టికెట్ అమలుకు సాంకేతిక కారణాలు అడ్డొస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేసిన తర్వాతే జీరో టికెట్ ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్ని రోజులపాటు మహిళలు టికెట్ లేకుండానే ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది.

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ ..

వయస్సుతో నిమిత్తం లేకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు. ఇందులో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే అనుమతించారు. మంచిర్యాల డిపోలో 93 పల్లెవెలుగు, 22 ఎక్స్‌ప్రెస్, 26 సూపర్‌లగ్జరీ, 7 రాజధాని బస్సులు ఉన్నాయి. రోజుకు 43 వేల మంది ప్రయాణికులను బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేరవేయటం ద్వారా దాదాపు రూ.25లక్షలు ఆదాయం సమకూరుతోంది. పల్లెవెలుగు బస్సుల ద్వారానే రూ.20 లక్షల పైనే ఆదాయం సమకూరుతుండగా మిగతా బస్సుల ద్వారా రూ.4 లక్షల నుంచి రూ.5లక్షలు వస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, ప్రధాన రూట్లలో పల్లెవెలుగులోనే హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సగానికి పైగా మహిళలు ప్రయాణిస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సులు 33 కాగా 8 ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ లెక్కన హైదరాబాద్ ఆదిలాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం తర్వాతే కొద్దిరోజులపాటు కార్డులు లేకపోయిన(జీరో టికెట్ వచ్చేంత వరకు) టికెట్ లేకుండా మహిళలు ప్రయాణం చేయొచ్చని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి
- ఆర్‌కేపీలో మోటార్‌సైకిల్ ర్యాలీ


మాట్లాడుతున్న వివేక్‌వెంకటస్వామి

రామకృష్ణాపూర్: చెన్నూర్‌కు వచ్చిన అనతికాలంలోనే తనను ఆదరించి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఆర్‌కేపీకి వచ్చిన ఆయనకు సుభాష్‌నగర్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో వివేక్ మాట్లాడారు. క్యాతనపల్లి ఆర్‌ఓబీ బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే పూర్తి చేయిస్తానని అన్నారు. అంతకుముందు స్థానిక సీపీఐ కార్యాలయంలో వివేక్‌ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పల్లె రాజు, గోపతి రాజయ్య, అబ్దుల్‌అజీజ్, వొడ్నాల శ్రీనివాస్, యాకూబ్‌అలీ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మందమర్రిరూరల్: పాలచెట్టు సమీపంలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో వివేక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణమాచారి ఆశీస్సులు పొందారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వివేక్ మాట్లాడుతూ ప్రజలు నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజాపాలనకు బాటలు వేశారని అన్నారు. చిర్రకుంట సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, గుడ్ల రమేష్, సట్ల సంతోష్ ఆలయ కమిటీ సభ్యులు శంకర్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగులతో సమావేశం

పాతమంచిర్యాల: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మంచిర్యాలలోని తన నివాసంలో శుక్రవారం దివ్యాంగులతో సమావేశం అయ్యారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మెడపట్ల సతీష్, బీవీ అప్పారావు, బండోజు నరేష్, ఇందూరి రమేష్, ఎండీ.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీని సందర్శించిన సింగరేణి సంచాలకులు


పనులను పరిశీలిస్తున్న సత్యనారాయణ

జైపూర్: జైపూర్ పవర్ ప్లాంట్‌ను సింగరేణి సంచాలకులు(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఎస్టీపీపీలోని యూనిట్–1లో టర్బైన్ మరమ్మతులను పర్యవేక్షించారు. పనులపై సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరమ్మతులకు సంబంధించిన అన్ని పరికరాలు, సామగ్రి సకాలంలో సమకూర్చుకుని త్వరగా యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం(ఈఅండ్ఎం) పీసీ బసివిరెడ్డి, చీఫ్(ఓఅండ్ఎం) జేఎన్ సింగ్, ఏజీఎం(పీసీఎస్) కే.శ్రీనివాసులు, ఎస్‌వోటు డైరెక్టర్ కేవీ రావు, డీజీఎం వేణుగోపాల్, ఎస్‌వోటు సీటీసీ ప్రభాకర్, సముద్రాల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాదర్బార్‌లో తాంసివాసి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న విద్యాధర్

తాంసి: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు మొట్టె విద్యాధర్ తనకు ఉపాధి నిమిత్తం రుణం అందించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం విన్నవించాడు. జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశాడు. కొన్నేళ్ల క్రితం ప్రమాదంలో చేయి కోల్పోయి దివ్యాంగుడిగా మారానని, తనకు రుణం అందించి ఆదుకోవాలని కోరాడు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు విద్యాధర్ తెలిపాడు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రేఖానాయక్ దంపతులు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

మద్యం మత్తులో దాడి.. ఒకరి మృతి

బెజ్జూర్: మద్యం మత్తులో జరిగిన గొడవలో ఒకరు మృతి చెందారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరె వసంత్ గురువారం సాయంత్రం మద్యం మత్తులో గ్రామానికి చెందిన ఆదే పురుషోత్తం (46)తో గొడవకు దిగాడు. దుర్భాషలాడుతూ.. పురుషోత్తం తలపై రాయితో కొట్టాడు. దాడిలో గాయపడ్డ పురుషోత్తం ఇంటికి చేరుకున్నాడు. పురుషోత్తం తలపై గాయం పెద్దగా కనిపించకపోవడంతో అతడి భార్య శంకర్‌బాయి ఇంట్లోనే పడుకోబెట్టింది. రాత్రి ఇంట్లో నిద్రించిన పురుషోత్తం తెల్లవారేసరికి మృతి చెందాడు. శంకర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

భీమారం: మంచిర్యాల నుంచి చెన్నూర్‌కు కిరాణా సామగ్రితో వెళ్తున్న మారుతీ వ్యాన్ శుక్రవారం సాయంత్రం భీమారం మండలం పోలంపల్లి వద్ద జాతీయరహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ జబీర్‌కు గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

చలిలో చన్నీటి స్నానమా?

- కేజీబీవీల్లో విద్యార్థినుల పాట్లు
- మూలనపడ్డ సోలార్ వాటర్ హీటర్లు



కేజీబీవీ భవనంపై సోలార్ పలకలు, గీజర్ మరమ్మతుకు నోచుకోకనే..

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ విద్యార్థినులు చలికాలంలోనూ చన్నీటి స్నానమే చేయాల్సిన దుస్థితి నెలకొంది. కేజీబీవీ భవనాలపై ప్రభుత్వం రూ.లక్షల విలువైన సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయగా అవి కొన్నాళ్లకు మరమ్మతుల్లేక నిరుపయోగంగా మారాయి. జిల్లాలో 18 కేజీబీవీలుండగా 4,506 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ భీమిని, భీమారం, కన్నెపల్లి, హాజీపూర్ మండలాల్లోని కేజీబీవీల్లో సోలార్ వాటర్ హీటర్లు ఇంకా ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థినులు బోరు నీటితో చన్నీటి స్నానం చేస్తున్నారు. అలాగే నెన్నెల, నీల్వాయి, జన్నారం, జైపూర్ కేజీబీవీల్లో సోలార్ వాటర్ హీటర్ల ప్లేట్లు డ్యామేజ్ కావడం, ఇతర కారణాలతో అవి మూలనపడ్డాయి. కొన్నిచోట్ల సోలార్‌తో వేడినీళ్లు వస్తున్నా విద్యార్థినులందరికీ సరిపోవడంలేదు. స్నానాల గదులు సరిపడా లేక విద్యార్థినులు ఉదయం 3.30గంటల నుంచే స్నానాల కోసం క్యూ కడుతున్నారు. వాటర్ హీటర్లు లేని చోట జలుబు, దగ్గుతో బాధపడే విద్యార్థినులకు స్టౌలపై వేడినీళ్లు కాచి ఇస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు దీటుగా హాస్టళ్లలో విద్యార్థినుల స్నానాల కోసం వేడి నీళ్ల సదుపాయం కల్పించింది. 2016–17లో సోలార్ వాటర్ హీటర్లను కేజీబీవీల్లో ఏర్పాటు చేసింది. అవి పనిచేసేందుకు సౌర ఫలకాలు బిగించింది. భవనాలపై ప్యానల్ బోర్డులతో పాటు గీజర్లు ఏర్పాటు చేశారు. నీళ్ల ట్యాంక్ సిస్టర్న్‌ల నుంచి పైపులైన్లతో అనుసంధానించారు. ప్యానల్ బోర్డులో వేడెక్కిన నీళ్లు గీజర్‌లోకి వెళ్లి అక్కడి నుంచి పైపుల ద్వారా స్నానాల గదులకు చేరుతాయి. మొదట్లో ఇవి బాగానే పనిచేసినా తర్వాత కొన్నిచోట్ల చిన్నచిన్న రిపేర్‌కు వచ్చాయి. వాటర్ హీటర్లు పనిచేసిన చోట విద్యార్థినులకు సరిపడా నీరందడం లేదు. ప్రస్తుతం చలితో సోలార్ వాటర్ హీటర్లు నుంచి వచ్చే వేడినీరు కూడా కొద్దిసేపటికే చల్లగా మారుతోంది. దీంతో విద్యార్థినులకు చలికాలంలోనూ చన్నీటి స్నానాలు తప్పడంలేదు. చన్నీటి స్నానం చేయడం కారణంగా చాలా మంది జ్వరాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. పాఠశాలల్లో వేడినీటి యంత్రాలు మరమ్మతుకు నోచుకోని విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తామని సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి తెలిపారు.

పంటలకు నత్తల బెడద

- ఆందోళనలో అన్నదాతలు



నందులపల్లిలో నత్తగుల్లలు

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో నత్తగుల్లలు మొక్కలను మేస్తూ పెరగకుండా నష్టపరుస్తున్నాయి. నందులపల్లి పెరడు, చేలు, పొలాల్లో అసాధారణ సంఖ్యలో సంచారం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయలు, ధాన్యం పంటలపై నత్తలు దాడి చేయడంతో మొక్కలు ఎదిగే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నందులపల్లిలో ఒక రైతు నాలుగేళ్ల క్రితం ఇతర ప్రాంతాల నుంచి మామిడి మొక్కలు తెచ్చి నాటాడు. ఆ మొక్కల కవర్ల మట్టిలో వచ్చిన నత్తలు క్రమక్రమంగా వ్యాప్తి చెంది నందులపల్లి, గన్‌పూర్, నెన్నెల శివారులోని పంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. రోజురోజుకూ వాటి సంతతి విపరీతంగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి వసతి, తేమ ఉన్న ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా వృద్ధి చెందుతాయని, రాత్రి వేళల్లోనే ఇవి సంచరిస్తూ మొక్కలను మేస్తాయని కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సామూహిక యాజమాన్య పద్ధతులు చేపట్టి నత్తలను నివారించకపోతే ఉద్యానవన పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కల మధ్య దొడ్డు ఉప్పు, మోనోపాస్‌పేట్ పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లకముందే అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మేనేజర్ బిల్లు చేస్తావా.. నీ జాబ్ పీకేస్తా

- కంప్యూటర్ ఆపరేటర్‌కు బదిలీపై వెళ్లిన కమిషనర్ బెదిరింపు!
- చర్యలు తీసుకోవాలన్న ఉద్యోగులు



మాట్లాడుతున్న మున్సిపల్ ఉద్యోగులు

బెల్లంపల్లి: 'మున్సిపల్ మేనేజర్ ఇంక్రిమెంట్ బిల్లు ఎందుకు చేశావు.. నేను ఉద్యోగంలో చేరాక నిన్ను పీకేస్తా.. నీ అంతు చూస్తా' అని బెల్లంపల్లి నుంచి బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య కంప్యూటర్ ఆపరేటర్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు బెల్లంపల్లి మున్సిపల్ సిబ్బంది తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మున్సిపల్ ఉద్యోగులతో కలిసి అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ తోట సురేశ్ మాట్లాడారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ సీడీఎంఏ నుంచి గత నెల 1న ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రకారం సస్పెండైన కాలానికి ఇంక్రిమెంట్ బిల్లు తయారు చేయాలని పేర్కొనగా, అప్పటి కమిషనర్ సమ్మయ్య ఎండార్స్‌మెంట్ చేసి ఇన్‌వార్డు ద్వారా వచ్చిన ఆదేశాల ప్రకారం తాను బిల్లు తయారు చేసినట్లు పేర్కొన్నారు. బిల్లు ఎందుకు చేశావని కమిషనర్ సమ్మయ్య ఫోన్ చేసి తిట్టి, బెదిరించారని సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కమిషనర్ బెదిరింపులకు పాల్పడటం సరికాదని తెలిపారు. ఇతర ఉద్యోగులను కూడా తప్పుడు బిల్లులు చేయాలని వేధించేవారని ఆరోపించారు. బదిలీపై వెళ్లినా కమిషనర్ ఆగడాలు ఆగడం లేదని విమర్శించారు. ఈ విషయంలో సీడీఎంఏ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు కోరారు. కమిషనర్ సమ్మయ్య వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తోట సురేశ్ వెంట మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్లు ఎండీ సర్వర్, రాజేందర్, టెక్నికల్ అధికారి అశ్రిత్, ఉద్యోగులు దుర్గయ్య, మల్లేశ్, మంద ఉదయ్, రాజశేఖర్, గాజుల సునీల్, శ్రీకాంత్, పవన్, కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మైనింగ్ స్టాఫ్ సమావేశం

శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్ సమస్యలపై చర్చించడానికి ఆదివారం సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో సాయంత్రం 5గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు మైనింగ్ స్టాఫ్ సబ్‌కమిటీ రీజియన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య హాజరవుతారని పేర్కొన్నారు. మైనింగ్ సిబ్బంది అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'వెలి'కి కారకులైన నలుగురికి జైలు

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం రాజలింగు కుటుంబంతోపాటు మరో ఎనిమిది మందిని కులం నుంచి వెలేసిన ఘటనలో నలుగురికి నెల జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ పీసీఆర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి శుక్రవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి కారణం లేకుండా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం గంగాధర్, దుర్గం లక్ష్మీనారాయణ, దుర్గం రాజలింగు, దుర్గం శంకరయ్యను కులం నుంచి వెలేసినట్లు 20.32.2018 న దుర్గం రాజలింగు జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై తహసినొద్దీన్ కేసు నమోదు చేసి చార్జీషీట్ వేశాడు. కేసు విచారించిన న్యాయమూర్తి దుర్గారాణి నెలరోజుల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

నూతన నియామకం



దీపక్‌కుమార్

బెల్లంపల్లి: ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్‌కమిటీ సభ్యుడిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన దీపక్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో దీపక్‌కుమార్ నియమితులైనట్లు తెలిపారు. తనపై నమ్మకముంచి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి దీపక్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నిర్మాణం కోసం మరింత పట్టుదలతో కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య



నితిన్ (ఫైల్)

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ నితిన్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన ధరంసింగ్–అనసూయాబాయి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. రెండో కొడుకు నితిన్ కొంత కాలంగా సిర్పూర్(యూ) మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో దేవాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. వీరి ప్రేమ వ్యవహారం మరో ఇద్దరికి తెలియగా వారు నితిన్‌ను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నితిన్ సోమవారం దేవాపూర్‌లోని తన ఇంటి సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నలుగురు మిత్రులకు వాట్సాప్ మెసేజ్ చేసి పురుగుల మందు తాగాడు. వాట్సాప్ మెసేజ్ చూసిన నితిన్ మిత్రులు అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. కుటుంబీకులు వెంటనే నితిన్ వద్దకు చేరుకుని చికిత్స కోసం మొదట కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తుకారాం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామ సమీపంలోని వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం, ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బండి విజయ్ ద్విచక్ర వాహనంపై బెజ్జూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో డబ్బా గ్రామానికి చెందిన ఎద్దు రమేశ్ కాగజ్‌నగర్ నుంచి డబ్బా వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తుకారాం భార్య శిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

భీమారంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చౌదరి

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్–14, 17 బాల, బాలికల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి చౌదరి, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పరిమళ, సర్పంచ్ గద్దె రాంరెడ్డి పోటీలను ప్రారంభించారు. 8,9,10 తేదీల్లో నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 400మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను ఈ నెల 7న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించగా, మంచిర్యాల మిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎంపీసీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి సీహెచ్ సాయిప్రణీత్ ఎంపికైనట్లు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. సాయిప్రణీత్ ఈ నెల 20నుంచి 22వరకు బెంగళూరు యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సాయిప్రణీత్‌ను కళాశాల ప్రిన్సిపాల్ పీ ఉపేందర్ రెడ్డి, కరస్పాండెంట్ టీ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్ ఎం.విజయ్‌కుమార్, పీడీ నూనె శ్రీనివాస్ అభినందించారు.



సాయిప్రణీత్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

'ఆదరిస్తే అవినీతిపై విచారణ చేయిస్తాం'



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే సింగరేణిలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని యూనియన్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే6 గనిపై కార్మికులతో మాట్లాడారు. కార్మికుల 11వ వేతన ఒప్పందంలో తమ యూనియన్ చరిత్రాత్మకమైన పాత్ర పోషించి మెరుగైన ఒప్పందం సాధించడానికి కృషి చేసిందని చెప్పారు. తమ వేజ్‌బోర్డు సభ్యుడు కే లక్ష్మారెడ్డి కృషి ఫలితంగానే నేడు కార్మికులకు కొత్త వేతనాలు అధికశాతం పెరిగాయని చెప్పారు. సింగరేణిలో బీఎంఎస్‌ను గెలిపిస్తే కార్మికులకు కొత్త హక్కులు, సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఆయన వెంట యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాశెట్టి నాగేశ్వరరావు, రాజేందర్, కలవేని సంపత్, దొంతుల రాజేందర్, గూడ శ్రీకాంత్, కాంపల్లి తిరుపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'గెలిస్తే కొత్త గనులు తెస్తాం'



యూనియన్‌లో చేరినవారితో జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపిస్తే సింగరేణిలో కొత్త భూగర్భ గనులు తీసుకువస్తామని, దీంతో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని యూనియన్ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6, శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌ల వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. కేసీఆర్ తన జేబు సంస్థగా ఇన్నాళ్లు సింగరేణిలో వ్యవహారాలు నడిపించారని ఆరోపించారు. ఇకముందు అలా జరగదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బొగ్గు, విద్యుత్ బకాయిలు రూ.30వేల కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇవి సకాలంలో వారు చెల్లించి ఉంటే సింగరేణిలో కొత్త గనులకు నిధులు వచ్చేవని తెలిపారు. కేసీఆర్ అండదండలతో టీబీజీకేఎస్ నాయకులు సింగరేణిలో అవినీతికి పాల్పడ్డారని, దీనిపై విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. రెండు చోట్ల ఏఐటీయూసీ, టీబీజీకేఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు నాయకులు, తటస్థ కార్మికులు ఐఎన్టీయూసీలో చేరగా వారికి జనక్‌ప్రసాద్ కండువా కప్పి స్వాగతం పలికారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, తిరుపతి రాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగె స్వామి, తిరుపతిరెడ్డి, భీంరావు, కార్యదర్శులు సమ్ము రాజయ్య, రాఘవరెడ్డి, జైపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భీం రవి, ఉపాధ్యక్షుడు జే నర్సింగ్, నాయకులు కొలిపాక సమ్మయ్య, సమ్మిరెడ్డి, చిలుముల రాయమల్లు, రామస్వామి, రమేశ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓట్లడిగే హక్కు మాకే ఉంది'



మాట్లాడుతున్న రాజిరెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల ఓట్లడిగే హక్కు తమకు మాత్రమే ఉందని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్సార్పీ 3, 3ఏ గనుల్లో ఆయన కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో ఏ జాతీయ సంఘం సాధించనన్ని హక్కులు, కొత్త సదుపాయాలు మరెక్కడా లేవన్నారు. తమ హయాంలో 60కి పైగా హక్కులు కల్పించామని చెప్పారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తాము కారుణ్య ఉద్యోగాలతో తిరిగి ఇప్పించామని గుర్తు చేశారు. నేడు 19,000 మంది కార్మికులు సింగరేణిలో కొత్తగా వచ్చారన్నారు. కార్మికులకు క్వార్టర్లకు విద్యుత్ మాఫీ చేయించామని, ఏసీ పెట్టుకునే సౌకర్యం కల్పించామన్నారు. తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం ఇప్పించిన ఘనత తమ నేత కేసీఆర్, యూనియన్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మాత్రమే దక్కిందన్నారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు డీ అన్నయ్య, కేంద్ర నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు వెంగళ కుమార్‌స్వామి, పెట్టం లక్ష్మణ్, కాశీరావు, బ్రాంచ్ సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, కానుగంటి చంద్రయ్య, అన్వేశ్‌రెడ్డి, చేరాలు, పిట్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ గెలిస్తేనే సింగరేణి మనుగడ'



మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్: ఏఐటీయూసీ గెలిస్తేనే సింగరేణి మనుగడ సాధిస్తుందని యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే వీరభద్రయ్య తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన చరిత్ర ఏఐటీయూసీకి మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు గుర్తింపు సంఘంగా గెలిచి కార్మికులకు అనేక హక్కులు సాధించామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కార్మికులు ఆదరించి గెలిపించాలని కోరారు. సమావేశంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మల్లేశ్, ఏరియా కార్యదర్శి మారుపల్లి సారయ్య, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రమేశ్, రాజయ్య, సంపత్ తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 7న జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జే దీపక్ విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్–17 బాలుర విభాగంలో 3వేల మీటర్ల పరుగు పందెంలో రాణించిన దీపక్ తన అసాధారణ ప్రతిభతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా దీపక్, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టె దేవేందర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ షేరు శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, డిప్యూటీ వార్డెన్ సందీప్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పాట్నాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో దీపక్ పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నగదు, బట్టలు దగ్ధం



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి ఓ రైతు ఇంట్లోని రూ.20వేల నగదు దగ్ధమైంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబాసాగర్ గ్రామానికి చెందిన రైతు కారు నీలేశ్ పత్తి అమ్మగా వచ్చిన రూ.20వేల నగదును ఇంట్లోని టేబుల్ సొరుగులో ఉంచాడు. రాత్రి విద్యుత్ సరఫరా లేక పోవడంతో టేబుల్‌పై దీపం వెలిగించాడు. ప్రమాదవశాత్తు టేబుల్‌పై ఉన్న బట్టలకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో టేబుల్ కాలిపోగా అందులో దాచిన రూ.వేల నగదు, బట్టలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. 25కిలోల బియ్యం, నిత్యావసరాలతో పాటు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు కత్తర్ల భీమేశ్, గొడిసెల మహేందర్, అడప శ్రీనివాస్, సాత్పుతె రాకేశ్, నాగపురి బాలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి ఊరుమందమర్రి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభించిందని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుమందమర్రి గ్రామస్తులకు అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25–30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భద్రపర్చినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుపాలని సూచించారు.